క్లుప్తంగా

అక్రమ కట్టడాల కూల్చివేత



జేసీబీతో అక్రమ నిర్మాణాలు కూల్చి వేయిస్తున్న దృశ్యం

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం పసుమాములలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సర్వే నెంబర్ 386లోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసిన సమాచారం మేరకు తహసీల్దార్ రవిందర్‌దత్తు సిబ్బందిని అక్కడికి పంపించారు. దీంతో అక్కడ వెలిసిన అక్రమనిర్మాణాలను జేసీబీ సహాయంతో అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని అక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన క్రీడోత్సవాలు



రన్నింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థినులు

ఆమనగల్లు: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం సహకారంతో నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాలు ముగిసాయి. రన్నింగ్, వాలీబాల్, ఖోఖో క్రీడలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు జ్యోతి, ఆనంద్ పాల్గొన్నారు.

రక్తదాతకు సత్కారం



సాయిబాబాను సత్కరిస్తున్న డాక్టర్ శారద

ఆమనగల్లు: పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన మేఘనకు పాతకోట సాయిబాబా రక్తదానం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అనారోగ్యంతో శ్రీ లక్ష్మి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మేఘనకు రక్తం అవసరం ఉందని డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న అదే కాలనీకి చెందిన పాతకోట సాయిబాబా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సాయిబాబాను ఆసుపత్రి వైద్యురాలు శారద సత్కరించారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రకాశ్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జంగయ్య గౌడ్



పొందాల జంగయ్య గౌడ్

మంచాల: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆరుట్ల గ్రామానికి చెందిన పొందాల జంగయ్య గౌడ్‌ను నియమిస్తూ గురువారం జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చాడని తెలిపారు. కష్ట కాలంలో పార్టీ బలోపేతానికి కృషి చేశాడన్నారు. పార్టీకి ఆయన సేవలు మరింత అవసరమని గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించారన్నారు. అనంతరం జంగయ్య గౌడ్ మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా నియమించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షీరాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మంగమ్మ

తుర్కయంజాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. మున్సిపాలిటీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆకుతోట శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన గురువారం తుర్కయంజాల్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంగమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రేణిగుంట రవీందర్, ప్రధాన కార్యదర్శి పంగిరి చక్రాధర్, కోశాధికారి యాదయ్య పాల్గొన్నారు.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం

- ట్రాఫిక్ జాంతో సతమతం
- ఏడాది కావస్తున్నా పూర్తికాని పనులు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ఇబ్రహీంపట్నం రూరల్: శేరిగూడ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో తరచూ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ఉదయం పూట ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. రాత్రయితే వారంలో రెండు ప్రమాదాలు జరుగుతున్నాయి. అసంపూర్తిగా నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రయాణం నరకంగా మారింది. సాగర్ రోడ్డు నుంచి ప్రయాణం చేయాలంటే వాహనదారులు, స్థానికులు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం ట్రాఫిక్ జాంతో సతమతం అవుతున్నామని వాపోతున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..


రెండు సంవత్సరాల క్రితం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి నీరు చేరడంతో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు మత్తడి దుంకడంతో శేరిగూడ సమీపంలోని చెక్‌డ్యాం నీటి ప్రవాహానికి ధ్వంసం అయ్యింది. రోడ్డు కూడా పూర్తిగా శిథిలమైంది. దీంతో గతేడాది ఏప్రిల్‌లో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవ తీసుకొని నియోజకవర్గంలోని కల్వర్టుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. అందులో భాగంగానే శేరిగూడా కల్వర్టు కోసం రూ.3 కోట్లు మంజూరు చేయించారు. ఈ క్రమంలో అధికారులు ఒక వైపు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మరో వైపు పనులు చేయకపోవడంతో ప్రధాన రహదారి కావడం వల్ల నిత్యం రోడ్డు రద్దీగా మారింది. హైదరాబాద్‌కు వెళ్లాలన్నా, ఇటు నాగార్జున సాగర్ వైపు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. ఎటు వెళ్లాలన్నా ఈ రహదారి గుండానే వెళ్లాలి. దీంతో ఈ బ్రిడ్జి వద్దకు వాహనాలు రాగానే పెద్ద ఎత్తున నిలిచిపోయి ట్రాఫిక్ జాం అవుతుంది.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

గత ప్రభుత్వంలో పనులు ప్రారంభించిన మాట వాస్తవమే. కొన్ని అనివార్య కారణాల వల్ల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు నిలిచిపోయాయి. రెండు, మూడు రోజుల క్రితం పనులు చేయాలని ఆదేశించాం. వారంరోజుల్లోపు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ప్రధాన రహదారి కాబట్టి ఇబ్బందిగా ఉంటుంది.

– వేణుగోపాల్‌రెడ్డి, డీఈ, రోడ్డు భవనాల శాఖ

పెండింగ్ పనులు పూర్తి చేయండి



ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎక్కడ పెండింగ్ పనులు ఉన్నా వెంటనే పూర్తి చేయాలి. పనులను త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించాను. ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే అధికారులే బాధ్యతవహించాలి. కొద్ది రోజులు ప్రజలు, ప్రయాణికులు జాగ్రత్తగా వెళ్లాలి.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

పెరుగుతున్న ప్రమాదాలు

గతేడాది నుంచి ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వందల సంఖ్యలో ఒకదాని తరువాత మరొకటి వాహనాలు ఢీకొంటున్నాయి. ఇటు ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం సంభవిస్తుంది. వాహనదారులు గాయాలపాలవుతున్నారు. కొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇంత పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

పాల బిల్లులు చెల్లించండి



ఆందోళన చేస్తున్న పాడి రైతులు

పాడి రైతుల సంఘం డిమాండ్

కడ్తాల్: పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా విజయ డెయిరీలో విక్రయిస్తున్న చిన్న, సన్నకారు రైతులకు బిల్లులు రావడం లేదని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలే పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య ఎండీతో సమస్యలు వివరించామన్నారు. మొదట ఒక బిల్లు 4 రోజుల్లో విడుదల చేయిస్తామని, తదుపరి బిల్లులు 20 రోజుల్లో ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. నేటికీ బిల్లులు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.200 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి సకాలంలో అందజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గత ప్రభుత్వంలో 38 నెలలుగా లీటరు పాలకు రూ.4 ప్రోత్సాహకం ఇవ్వడంలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం లీటరు పాలకు రూ.5 ప్రోత్సాహకం కూడా 4 నెలలుగా ఇవ్వడం లేదని వారు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడారి రామకృష్ణ, ముత్తి రంగన్నా, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, అశోక్‌రెడ్డి, కుమార్, సాయిప్రభు, దశరథ్, సత్యం, నరేశ్, రమణ, రాజేశ్, రంగ, గణేశ్, శేఖర్, గిరిధర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచాలి

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి

మాడ్గుల: మాడ్గుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఏర్పాటు చేయాలని మాడ్గుల మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్య గౌడ్, సుద్దపల్లి మాజీ సర్పంచులు నరసింహులు కోరారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను గురువారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి సరిపడక ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందడంలేదని వారు పేర్కొన్నారు. పెరిగిన జనభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈ విషయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి సురమాంబ దేవిల విగ్రహప్రతిష్ఠ, కల్యాణోత్సవం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం నూతన విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం జలాధివాసం, రాత్రి 7గంటలకు గ్రామ గౌడ కళాకారులచే గౌడ పురాణం నాటకం మొదటి భాగం ప్రదర్శించారు. శుక్రవారం ఉదయం గౌడ కులస్తులు ఇంటింటా జల బిందెలు తీయుట, ఆలయం వద్ద గణపతి పూజ, అఖండ స్థాపన, అఖండ దీపారాధన, గణపతి, రుద్రగాయత్రి, కంఠమహేశ్వర, వనంఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతల హోమాలు, పూర్ణాహుతి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఏవో రాజు

తలకొండపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల బారినుంచి పంటలను కాపాడుకోవచ్చని ఏవో రాజు రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపూర్ రెవెన్యూ శివారు భూముల్లో ఆయన పర్యటించి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న పైరకు కత్తెర తెగుళ్లు వచ్చే అవకాశముందన్నారు. ఈ కత్తెర పురుగు పంటపై దాడి చేసి అపార నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఆకుల మీద పత్రహరితాన్ని గోకి తినుట వలన ఆకులపై తెల్లటి పొర ఏర్పడుతుందన్నారు. కాండం మొవ్వులో చేరి తినటం వలన విచ్చుకున్న ఆకుల్లో వరుస రంధ్రాలు ఏర్పడుతాయన్నారు. క్రమంగా మొవ్వును తినేయటం వలన మొవ్వు కత్తిరించినట్లుగా కనిపిస్తుందన్నారు. మొవ్వు లోపల ఉన్న పూత కూడా నష్టపోయి కంకి తయారవ్వదన్నారు. వీటి నివారణకు హిమాక్టిన్ బెంజోయేట్ ఎకరాకు 100 గ్రాములు మరియు డెల్టామేత్రిన్ డెల్టా మెత్రిన్ ఎకరాకు 100 ఎంఎల్ చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరిష, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో రాజు

న్యాయం చేయండి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దండుమైలారం నేతలు, రైతులు

ఇబ్రహీంపట్నం: దండుమైలారం గ్రామ పంచాయతీ పరిధిలోని హఫీజ్‌పూర్ రెవెన్యూ రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. కొన్నేండ్లుగా 620 ఎకరాల్లో సుమారు 400మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో అనంతరెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేశ్, ఎంఆర్ఆర్ యువసేన, ముదిరాజ్ సంఘం నాయకులు రావణమోని లింగం, తాళ్లగూడెం నరేష్, కాకి పవన్, చీమల నాగేశ్వరరావు, రాసాల శ్రీశైలం, బిర్లా బాలప్ప, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు ఇస్తున్న సత్యం

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇరువురు కుటుంబాలకు శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన కటుకూరి సాయిలు అనారోగ్యంతో, అదే గ్రామానికి చెందిన గడియ యాదమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకొని ఇరువురి కుటుంబ సభ్యులకు గురువారం మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం చేశారు.

ఎస్ఎస్‌సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎంఈఓ సర్దార్‌నాయక్

ఆమనగల్లు: ఈ నెల 18నుంచి 30వరకు జరగనున్న ఎస్ఎస్‌సీ పరీక్షల కోసం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ తెలిపారు. పది పరీక్షా కేంద్రాలలో 1,924 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన వివరించారు. తలకొండపల్లి ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 254 మంది, వెల్జాల్ ఉన్నత పాఠశాలలో 102, ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 280, బాలికల ఉన్నత పాఠశాలలో 280, కడ్తాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 220, బి సెంటర్‌లో 194, ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 99, మాడ్గుల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎ సెంటర్‌లో 185, బీ సెంటర్‌లో 178, ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 132 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఈఓ సర్దార్‌నాయక్

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



బహుమతులు అందజేసిన వెంకటేశ్‌గుప్తా

డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో విద్యాభారతి మోడల్ స్కూల్‌లో గురువారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు ఒక్కరోజు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నా రు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈ పరమేశ్, పాఠశాల చైర్మన్ లక్ష్మణ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మల్లేశ్, సతీశ్, ఉపాధ్యాయులు శోభరాణి, ఉమారాణి, మౌనిక, మమత, సరిత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత

తలకొండపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పేర్కొన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు, మిలెట్స్, తదితర పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నట్లైతే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. మండల పరిధిలోని తుమ్మలకుంట తండాలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక పక్షం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడారు. చౌకగా దొరికె ఆకుకూరలు, కాయగూరలతో పోషక ఆహారాన్ని తయారు చేసి ప్రదర్శించారు. ఆహారలేమితో గర్భిణులు, తల్లులు, మహిళల్లో రక్తహీనత వచ్చే ప్రమాదముందన్నారు. అన్నిరకాల పోషక విలువ లున్న ఆహారాన్ని తీసుకోవడంతోనే రక్తహీనత నివారించొచ్చన్నారు. ఈ కార్యక్రమమంలో అంగన్‌వాడీ టీచర్ సెరిమాళ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలకుంట తండాలో చిన్నారులకు అక్షరాభ్యాసం

శాంతిభద్రతలే లక్ష్యం

సీఐ శంకర్‌కుమార్

యాచారం: మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతే లక్ష్యమని యాచారం సీఐ శంకర్‌కుమార్ పేర్కొన్నారు. మంతన్‌గౌరెల్లి గ్రామంలో గురువారం సాయంత్రం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కవాతులో పాల్గొన్న సీఐ శంకర్‌కుమార్

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు

తుర్కయంజాల్: పదోతరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దని కొహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి బాయి తెలిపారు. బుధవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొర్రూర్‌కు చెందిన భీమిడి అభిలాష్ రెడ్డి నానమ్మ, తాతయ్య జ్ఞాపకార్థం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దన్నె రాజు, జగన్ రాజు, నరసింహ, లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, రాధా, మాధవి, కొండయ్య, మంజూల, కృష్ణకుమార్, వెంకటేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మంచాల: ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీఎస్ స్పోర్ట్స్ ఎడ్యూకేషన్ సోసైటీ ఆధ్వర్యంలో గురువారం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యాభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులకు కీర్తిని తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేగావత్ లక్ష్మా నాయక్, రాజు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి పంపిణీ చేసిన అభిలాష్‌రెడ్డి



మంచాల: ప్యాడ్లు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ఆమనగల్లు: గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంత్ సేవాలాల్ మహరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కృష్ణనాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన గిరిజనులను ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కడ్తాల్: కాంగ్రెస్ ప్రభుత్వం సంత్ సేవాలాల్ మహరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ లంబాడీల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం మేరా దర్జీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ యువజన నేత తాళ్లపల్లి కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం అన్ని కులసంఘాలకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తారని భావిస్తే అందుకు భిన్నంగా కేసీఆర్ పాలన సాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారపగ్గాలు చేపట్టిన వంద రోజుల్లోనే వివిధ కుల సంఘాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.